డిఆర్ఒగా భాస్కరరావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా రెవెన్యూ అధికారిగా జె.ఉదయ భాస్కరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక కలెక్టరేట్లో బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పలువురు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డిఆర్ఒ ఉదయభాస్కరరావు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిఆర్ఒకు అభినందనలు తెలిపారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డిఆర్ఒ

ఎన్నికల 'కోడ్' కూసే..!

అసెంబ్లీ, లోకసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల - అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి

ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్, మే 13న ఎన్నికలు - 21 రోజుల అనంతరం జూన్ 4న ఓట్ల లెక్కింపు

నాలుగో విడతలో ఎన్నికల నిర్వహణపై అభ్యర్థుల్లో నిర్వేదం - ఎక్కువ సమయం ఉండటంతో ఖర్చుపై లోలోన ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అసెంబ్లీ, లోకసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఇక నుంచి అధికారులంతా ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో పని చేయాల్సి ఉంటుంది. ప్రజాప్రతినిధుల ఆదేశాలకు అనుగుణంగా అధికారులు ఇక నుంచి పని చేసే వీలుండదు. జిల్లాలో ఎన్నికల కోడ్ ఆఫ్ కాండాక్ట్ సజావుగా అమలు చేసేందుకు జెడ్‌పి సిఇఒను నోడల్ అధికారిగా నియమించారు. మండలాల్లో ఎంపిడిఒలు, పట్టణాల్లో కమిషనర్లు నోడల్ అధికారులుగా పని చేయనున్నారు. కోడ్ అమల్లోకి రావడంతో ఇక నుంచి పరిస్థితి పూర్తిగా మారనుంది. ప్రభుత్వ పథకాల అమలుపైనా ఆంక్షలు ఏర్పడే అవకాశం ఉంది.

నాలుగో విడతలో ఎన్నికలు.. అభ్యర్థుల్లో గుబులు

దేశవ్యాప్తంగా ఏడు విడతల్లో లోకసభ ఎన్నికలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో అసెంబ్లీ, లోకసభ ఎన్నికలను నాలుగో విడతలో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. 2019లో తొలివిడతలో ఎన్నికలు జరిగాయి. దీంతో ఏప్రిల్ రెండో వారానికి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యింది. ఈసారి ఏప్రిల్ 18న నోటిఫికేషన్, 25వ తేదీ వరకూ నామినేషన్ల గడువు, 26న పరిశీలన, 29న ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది. 2019లో ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత దాదాపు నెల రోజుల వ్యవధిలో ఎన్నికల ప్రక్రియ ముగిసింది. ఈసారి షెడ్యూల్ విడుదలకు, పోలింగ్‌కు మధ్య దాదాపు రెండు నెలల వ్యవధి ఉంది. దీంతో అభ్యర్థుల్లో గుబులు నెలకొంది. వేసవి ఎండల తీవ్రత ఇబ్బందులతోపాటు రెండు నెలల వ్యవధి ఉండటంతో ఎన్నికల ఖర్చు భారీగా అయ్యే పరిస్థితి ఉందని అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రచారానికి ఎక్కువ సమయం ఉండటంతో ప్రతిరోజూ పెద్దఎత్తున ఖర్చు కానుందని లెక్కలు వేస్తున్నారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత సైతం ఈసారి పోలింగ్‌కు 14 రోజులు వ్యవధి ఉంది. గతంలో పది రోజులు, అంతకు తక్కువగానే సమయం ఉండేది. ప్రస్తుత పరిస్థితుల్లో అసెంబ్లీకి పోటీ చేస్తున్న అభ్యర్థికి రూ.25 నుంచి రూ.30 కోట్లు వరకూ ఖర్చవుతుందని అభ్యర్థులు అంతర్గత సమావేశాల్లో చెబుతున్నారు. ఎన్నికల ప్రక్రియ నాలుగో విడతకు వెళ్లడంతో ఖర్చు మరో రూ.పదికోట్లు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బరిలో నిలబడిన అభ్యర్థులు ఖర్చు గురించి లోలోన తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. రెండు జిల్లాల్లో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

వైసిపి అభ్యర్థులు వీరే

గూడూరి ఉమాబాల నరసాపురం ఎంపీ అభ్యర్థి
ముదునూరి ప్రసాదరాజు నరసాపురం
కారుమూరి నాగేశ్వరరావు, తణుకు
కొట్టు సత్యనారాయణ తాడేపల్లిగూడెం
చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఆచంట
గ్రంధి శ్రీనివాస్ భీమవరం
పివిఎల్.నరసింహరాజు ఉండి
గుడాల గోపీ పాలకొల్లు
కారుమూరి సునీల్ ఏలూరు ఎంపీ అభ్యర్థి
ఆళ్ల నాని, ఏలూరు
కొఠారు అబ్బయ్యచౌదరి దెందులూరు
పుప్పాల వాసుబాబు ఉంగుటూరు
మేకా వెంకటప్రతాప్ అప్పారావు, నూజివీడు
తెల్లం రాజ్యలక్ష్మి పోలవరం
కంభం విజయరాజు చింతలపూడి
దూలం నాగేశ్వరరావు కైకలూరు

ఉండి బరిలో టిడిపి రెబల్..!

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా: మాజీ ఎంఎల్ఎ శివరామరాజు

ప్రజాశక్తి - భీమవరం

ప్రజలు, రైతులు, బడుగు బలహీన వర్గాల ఆకాంక్ష మేరకు ఉండి నియోజకవర్గం నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ) ప్రకటించారు. భీమవరంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉండి నియోజకవర్గంలో సమస్యలు, ప్రజల కష్టాలు తనకు తెలుసునన్నారు. గతంలో ఎంఎల్ఎగా ఉండి నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేశానన్నారు. ప్రజల ఆకాంక్షల మేరకు, వారి విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకుని మరిన్ని సేవలందించడానికి తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీలోకి దిగుతున్నానన్నారు. రైతులకు సాగునీరు అందించడానికి, ఆక్వా రంగానికి 24 గంటలు విద్యుత్ అందించడానికి, రైతుల పంటలను మద్దతు ధరకు కొనుగోలు కోసం ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీలు అందించడానికి ఎంఎల్ఎగా తన పదవీకాలంలో ఎంతో కృషి చేశానన్నారు. ఈ సమావేశంలో ఉండి ఎఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, నడింపల్లి వెంకటరాజు, మంతెన రవిరాజు, ఇందుకూరి అప్పలరాజు , ఇందుకూరి మురళీకృష్ణంరాజు, మోపిదేవి శ్రీనివాస్, బురిడి రవిబాబు, కలవపూడి సుబ్బరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శివరామరాజు

పటిష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి

కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ శనివారం విడుదల చేసిందని, ఈ నేపథ్యంలో ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందని, రాజకీయ పార్టీల ప్రచార బ్యానర్స్, కటౌట్లు, వాల్ పోస్టర్లు, ఫొటోలు తొలగించాలన్నారు. రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు వస్త్రం కప్పి ఉంచడం, తదితర పనులన్నింటిని నిర్ణీత గడువులోగా సంబంధిత అధికారులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గడువు అనంతరం ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎన్నికల విధులు నిష్పాక్షపాతంగా నిర్వహించాలి

ఉద్యోగులు ఎన్నికల విధులను నిష్పాక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. రాజకీయ పార్టీలకు మద్దతుగా పని చేస్తే ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్లో భీమవరం, నరసాపురం, ఉండి నియోజకవర్గాలకు సంబంధించి ఆర్ఒలు, ఎంపిడిఒలు, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, విఎస్‌టి, వివిటి బృందాలతో ఐటి యాప్స్ వినియోగంపై శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎవరికీ భయపడకుండా నిర్భయంగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని, నగదు, గిఫ్ట్‌లు, గ్యాస్ స్టౌలు, గ్యాస్ బండలు, లిక్కర్, బెడ్ షీట్స్ పంపిణీలను గుర్తించి నిబంధనలు మేరకు చర్యలు తీసుకోవడంతో పాటు, సీజ్ చేసి వాటిని భద్రపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్‌ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కరరావు, నరసాపురం ఆర్‌డిఒ ఎం.అంబరీష్, భీమవరం ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, ఎలక్షన్స్ సూపరింటెండెంట్ సిహెచ్.దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

జిల్లాలో సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

జిల్లాలో సాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డికి వివరించారు. విజయవాడ, సిఎస్ క్యాంపు కార్యాలయం నుంచి శనివారం గ్రూప్-1 పరీక్షలు, మోడల్ కోడ్ ఆఫ్ కండెక్ట్, పట్టా, డికెటి, ప్రభుత్వ భూములకు సంబంధించి భూ సేకరణ తదితర అంశాలపై జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. రబీ సీజన్ పూర్తయ్యేనాటికి జిల్లాలో సాగునీటి ఎద్దడి ఉన్న మండలాల్లో నీటి కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

27,426 మంది విద్యార్థులకు 127 పరీక్షా కేంద్రాలు

1390 మంది ఇన్విజిలేటర్లు నియామకం

నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించేది లేదు

డిఇఒ వెంకటరమణ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. జిల్లావ్యాప్తంగా బాలురు 14,624, బాలికలు 12,802 మంది మొత్తం 27,426 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 21,341 మంది, గతేడాది పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు 6085 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. 127 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 18 నుండి 30వ తేదీ వరకు పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్నాయి. ప్రశ్నాపత్రాలను జిల్లాలోని 22 స్టోరేజీ పాయింట్లలో భద్రపర్చారు. పరీక్షల నిర్వహణకు ముందు ఈ పత్రాలను ఆయా పరీక్షా కేంద్రాలకు పటిష్ట భద్రత నడుమ తరలించనున్నారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్లు 127 మంది, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు 127 మంది, అడిషనల్ డిపార్టుమెంటల్ ఆఫీసర్లు 15 మంది, మొదటి కస్టోడియన్లు 22 మంది, రెండో కస్టోడియన్లు 22 మందిని నియమించారు. ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్లు, 24 సిట్టింగ్ స్క్వాడ్లు, 1390 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందు చేరుకోవాలని, అరగంట ముందు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని చెబుతున్నారు. సిబ్బంది సైతం గుర్తింపు కార్డులు ధరించి విధులకు హాజరుకావాలని ఆదేశాలిచ్చారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించేది లేదని, సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయని ప్రకటించారు. జిల్లా కలెక్టరేట్లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశారు. 9346726024 నెంబర్‌కు ఉదయం నుండి సాయంత్రం వరకు ఫోన్ చేసి సమస్యలు తెలపడంతోపాటు సందేహాలు నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు.


మాట్లాడుతున్న వెంకటరమణ

అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం: డిఇఒ వెంకటరమణ

పదో తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. స్థానిక కలెక్టరేట్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు చేపట్టమన్నారు. విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు సంబంధిత రూట్లలో బస్సులు తిప్పేలా చర్యలు చేపట్టామన్నారు. అలాగే ఓపెన్ స్కూల్ ద్వారా నిర్వహించే ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 18 నుండి 27 వరకు జరుగుతాయని, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ఎస్ఎస్‌సి 997 మంది, ఇంటర్మీడియట్ 1,890 మంది మొత్తం 2,887 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో ఈ ఏడాది అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళిక రూపొందించామని డిఇఒ చెప్పారు. విద్యార్థులను ఎ, బి, సి, డి కేటగిరీలుగా విభజించి అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా బోధన సాగించామన్నారు. గతేడాది 65.9 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది 85 శాతం ఉత్తీర్ణత సాధించాలని లక్ష్యంగా తీసుకున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి విద్యాశాఖ సహాయ కమిషనర్ ఎన్.సత్యనారాయణ, సూపరింటెండెంట్ ఎన్.తిరుపతిరాజు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీరు ఇవ్వాలంటూ రైతులు రాస్తారోకో

ప్రజాశక్తి - వీరవాసరం

మత్స్యపురి రెవెన్యూ పరిధిలో వరి చేలు ఎండిపోతున్నాయని, అధికారులు తక్షణమే సాగు నీరందించి తమ పంటను కాపాడాలని రైతులు భీమవరం-నరసాపురం ఆర్అండ్‌బి రోడ్డుపై శనివారం రాస్తారోకో చేశారు. గత 20 రోజుల నుంచి సాగు నీరందక పొట్టదశలో ఉన్న వరి చేలు దెబ్బతినే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ మత్స్యపురిలో కాలువ ఎగువ భాగంలో ఉన్న పెద్ద రైతులు సాగునీరును ఇంజన్లతో తోడేసుకోవడంతో కింది భాగంలో ఉన్న సన్న చిన్న కారు రైతుల భూములకు సాగునీరందడం లేదన్నారు. దీంతో సుమారు రెండు వందల ఎకరాలకు సాగునీరందని పరిస్థితి కొనసాగుతుందన్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వరి భూములు బీటలు వారాయన్నారు. రైతు చింతా నారాయణమూర్తి మాట్లాడుతూ సాగు నీరందకపోవడంతో బోరునీరు, ఆక్వా చెరువుల నుంచి వదిలిన నీటిని చేలకు మళ్లించడంతో వరి చేలు ఎరుపు రంగులోకి మారాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు రాస్తారోకో చేస్తున్న రైతుల వద్దకు వచ్చి చర్చించారు. రైతులు సాగునీరుకు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదన్నారు. సాగునీటి ఇబ్బందులను పరిష్కరించేందుకు ఇప్పటికే మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో ఈ కమిటీలు నిరంతర పర్యవేక్షిస్తూ సాగునీరు ఇబ్బంది లేకుండా చూస్తారన్నారు. వంతుల వారీ విధానంలో మత్స్యపురికి మూడు రోజులు కేటాయించినట్లు తెలిపారు. శుక్రవారం వంతు ప్రారంభమైందన్నారు. మత్స్యపురిలో సాగునీరు అక్రమంగా తోడుకుంటున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. మండల కమిటీలో తహశీల్దార్, ఎస్ఐ, ఇరిగేషన్, అగ్రికల్చర్ అధికారులుంటారని చెప్పారు. గ్రామ కమిటీలో విఆర్ఒ, లష్కర్, వ్యవసాయ అసిస్టెంట్లు ఉంటారన్నారు. రాస్తారోకోలో కౌలు రైతులు, నిప్పులేటి వెంకటేశ్వరరావు, గుబ్బల సత్యనారాయణ, దేవిరెడ్డి సూర్యనారాయణ, ఇనుకొండ రాంబాబు, తెన్నేటి వెంకట్రావు, పుప్పాల రాజియ్య, గంటా వెంకటస్వామి పాల్గొన్నారు.

రాస్తారోకో చేస్తున్న రైతులు

జనసేన నరసాపురం టిక్కెట్ ఖరారవ్వలేదు

మాజీ మంత్రి సుబ్బారాయుడు

ప్రజాశక్తి - నరసాపురం

జనసేన నరసాపురం టిక్కెట్ ఖరారైనట్లు తన దృష్టికి రాలేదని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. శనివారం సాయంత్రం సుబ్బారాయుడు స్వగృహంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన నరసాపురం టిక్కెట్ అధికారికంగా ప్రకటించలేదన్నారు. ఇంకా తాను పోటీలో ఉన్నానని, తనను టిక్కెట్ ఖరారైన నేత ఎవరూ కలవలేదన్నారు. తనకు ఒక వర్గం మద్దతు కాదని, అన్ని రకాల వర్గాల్లో మద్దతు ఉందన్నారు. పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ తనతో సంప్రదిస్తారన్నారు. ఉమ్మడి అభ్యర్థిని ప్రకటించలేదన్నారు. నరసాపురం నియోజకవర్గానికి అధిక ప్రాధాన్యత ఉందన్నారు. తాను పోటీలో ఉన్నానన్నారు. ప్రధాని మోడీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ హాజరయ్యే గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో జరిగే సభకు అందరూ పాల్గొనాలన్నారు. తొలుత మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రుస్తుంబాదలోని సుబ్బారాయుడు స్వగృహం నుంచి ప్రారంభమైన ర్యాలీ మిషన్ హై స్కూల్ రోడ్డు, పంజాసెంటర్, మెయిన్ రోడ్డు, అంబేద్కర్ సెంటర్, మొగల్తూరు రోడ్డులో జరిగింది. అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకిరామ్, గుగ్గిలపు మురళి, కొత్తపల్లి నాని, వన్నెంరెడ్డి శ్రీను, మల్లెపూడి చినబాబు, దాసరి శ్రీను, దొండపాటి స్వామి పాల్గొన్నారు.

అభ్యర్థులు.. అసంతృప్తులు..!

జిల్లాలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన అభ్యర్థులు దాదాపుగా ఖరారయ్యారు. కైకలూరు స్థానం నుంచి బిజెపి బరిలోకి దిగితే అభ్యర్థి ఎవరనేది తేలాల్సి ఉంది. అలాగే నరసాపురం, ఏలూరు ఎంపీ స్థానాలకు సంబంధించి టిడిపి కూటమి నుంచి అభ్యర్థులు ఖరారు కావాల్సి ఉంది. ఇక అభ్యర్థిత్వాలు ఖరారైన తర్వాత తిరుగుబాట్లు, అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా ప్రతిపక్ష టిడిపి కూటమిలోనే ఇవి ఎక్కువ ఉండటం గమనార్హం. అయితే ఈ అసంతృప్తులు తిరుగుబాటు స్థాయికి చేరతాయా.. లేక సమసిపోతాయా అనేది నామినేషన్ల ఘట్టం వరకూ వేచిచూడాలి.

అభ్యర్థుల ఖరారుతో రెండు జిల్లాల్లో రాజకీయం మరింత వేడెక్కింది. అభ్యర్థులు గెలుపు బాట కోసం ముఖ్యనేతలు, అనుచరులతో మంతనాలు సాగిస్తూ ప్రచారంలోనూ నిమగ్నమయ్యారు. అధికార వైసిపి ముందుగా ప్రకటించినట్లుగానే ఆయా నియోజకవర్గ సమన్వయ కర్తలుగా ఉన్నవారినే అభ్యర్థులుగా ప్రకటించింది. ఈ తరుణంలో సిట్టింగ్ ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను లక్ష్యం చేసుకుని తరచూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న టిక్కెట్ దక్కని చింతలపూడి సిట్టింగ్ ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా ఏ వైఖరి తీసుకుంటారో వేచిచూడాలి. అధికార వైసిపికి స్వపక్షం అక్కడ తప్ప ఇతర నియోజకవర్గాల్లో పెద్దగా ఇబ్బందులేమీ పైకి కానరావడం లేదు. పాలకొల్లు, ఆచంట, తాడేపల్లిగూడెం, ఏలూరు తదితర నియోజకవర్గాల్లో లోలోన ఉన్న అసంతృప్తులు ఏ మేరకు ప్రభావం చూపుతాయో వేచిచూడాలి.

ఇక ప్రతిపక్ష టిడిపి కూటమికి మాత్రం ఎక్కువ నియోజకవర్గాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నూజివీడులో మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతారా.. లేక మౌనంగా ఉండిపోతారా అనేది స్పష్టత రావాల్సి ఉంది. ఉండిలో మాజీ ఎంఎల్ఎ శివరామరాజు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ప్రకటించడంతో ఆ నియోజకవర్గ రాజకీయం రసవత్తరంగా మారింది. శివ టిడిపి ఓట్లు చీల్చుతారా, లేక వైసిపి ఓట్లు చీల్చుతారా అనే చర్చ పెద్దఎత్తున సాగుతోంది. అయితే నరసాపురం ఎంపీ అభ్యర్థిగా రఘురామకృష్ణంరాజు బరిలోకి దిగితే శివను పోటీ నుంచి తప్పించే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. ఏం జరుగుతుందో వేచిచూడాలి. అలాగే నరసాపురం సీటు ఆశించిన టిడిపి మాజీ ఎంఎల్ఎ మాధవనాయుడు భంగపాటుకు గురయ్యారు. ఇక్కడ గ్రూపుల పోరు ఎక్కువ కావడంతో టిడిపి అధిష్టానం తెలివిగా జనసేనకు ఈ సీటు ఇచ్చేసిందనే ప్రచారం సాగుతోంది. అయితే తన భవిష్యత్తు కార్యాచరణ త్వరలో ప్రకటిస్తానని మాధవనాయుడు ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. అలాగే పోలవరం, ఉంగుటూరుల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీల నుంచి, నేతల నుంచి జనసేనకు ఆయా సీట్లు కేటాయింపుపై నిరసనలు ఎగసినా అధిష్టానం చాకచక్యంగా చల్లబరినట్లు ప్రస్తుత పరిస్థితులు కన్పిస్తున్నాయి. అయితే వీరు జనసేన అభ్యర్థుల విజయానికి ఏమేరకు కృషి చేస్తారనేది వేచిచూడక తప్పదని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. జనసేనకు సంబంధించి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, తణుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్రరావు పైపైకి ఎలాగున్నా లోలోన తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. దీనికితోడు నరసాపురం టిక్కెట్ ఆశించి జనసేనలో చేరిన మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు పయనం ఎటో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అక్కడ బొమ్మడి నాయకర్ అభ్యర్థిత్వం దాదాపు ఖరారైన సంగతి తెలిసిందే. అయితే అది అధికారికం కాదని కొత్తపల్లి చెబుతుండటం గమనార్హం. ఈ ఎన్నికల్లో తాను కచ్చితంగా పోటీ చేస్తానని జనసేనలో చేరకముందు ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో కొత్తపల్లికి టిక్కెట్ దక్కకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తారా లేదా అనేది వేచిచూడాలి. మొత్తానికి అసంతృప్తులు ఏ రూపం తీసుకుంటాయనేది నామినేషన్ల పర్వం ముగిసే వరకూ వేచిచూడక తప్పదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

సిఎఎను వ్యతిరేకించాలి

ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండి సిష్టి

ప్రజాశక్తి - ఆకివీడు

మత ప్రాతిపదికన తీసుకొచ్చిన సిఎఎను అందరూ వ్యతిరేకించాలని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండి సిష్టి పిలుపునిచ్చారు. సిఎఎను వ్యతిరేకిస్తూ స్థానిక షాదీఖానాలో సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హిందువులకు, ముస్లింలకు మధ్య విబేధాలు సృష్టించి రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందాలని బిజెపి ప్రభుత్వం చూస్తుందన్నారు. 2019లో తీసుకొచ్చిన ఈ చట్టాన్ని మళ్లీ ఐదేళ్ల తర్వాత ఎన్నికలు సమీపిస్తున్న వేళ తీసుకొచ్చిందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. ముస్లిం పెద్దలు ఎండి.మదనీ మాట్లాడుతూ విభజన చట్టాలను తీసుకొచ్చి విబేధాలు సృష్టించడం బిజెపికి సరికాదన్నారు. సిపిఎం జిల్లా నాయకులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ ప్రజలందరూ ఐక్యంగా ఈ చట్టాలను తరిమికొట్టాలని, లేకపోతే రానున్నరోజుల్లో దేశం మతకల్లోలతో ప్రజలందరూ ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందన్నారు. దేశ సమైక్యతకు దెబ్బతీసే ఇటువంటి చట్టాలను వ్యతిరేకించాలన్నారు. వైసిపి నాయకులు ఎండి జక్కి మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో ముస్లింలు, హిందువులందరూ కలిసి బ్రిటిష్ వారిని తరిమికొట్టారన్నారు. ఇటువంటి నల్ల చట్టాలను బిజెపి ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.తవిటినాయుడు, షేక్ వలి, పెంకీ అప్పారావు, ఎస్.ఉదయ్‌కుమారి, డి.రవితేజ, బి.రాంబాబు, ఎస్.సూరిబాబు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

విధులు నిష్పాక్షపాతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - ఆచంట

సార్వత్రిక ఎన్నికలకు నియమితులైన అధికారులు, సిబ్బంది నిష్పాక్షపాతంగా విధులు నిర్వహించాలని ఆచంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు అన్నారు. ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ సిబ్బందికి రెండో రోజు శనివారం శిక్షణా తరగతులు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏ విధమైన సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. పోలింగ్ రోజు అవసరమయ్యే సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మాస్ పోలింగ్ నిర్వహణ వివిధ పత్రాలు పూరించే వివరాలు, ఇవిఎంపై అవగాహన కోసం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు నియోజకవర్గం నుంచి 451 మంది ఉపాధ్యాయులు హాజరైనట్లు చెప్పారు. తహశీల్దార్ ఐపి.శెట్టి, ఎంపిడిఒ నరసింహప్రసాద్, ఇఒపిఆర్‌డి మూర్తిబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కె.సాయిరెడ్డి, జి.పెద్దిరాజు, ఎం.వెంకట్రావు, ఎం.శ్రీనివాస్, టి.వెంకటరామయ్య, పి.పోతురాజు, సిహెచ్‌వి.నరేంద్ర, బిఐఎస్ గుప్తా, వి.శ్రీనివాసులు పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నేటి విద్యార్థులే రేపటి భారత ప్రగతి సారధులు అని అంతర్జాతీయ లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. స్థానిక సుబ్బారావుపేట మున్సిపల్ హైస్కూలులో డైమండ్స్ లయన్స్ క్లబ్ తాడేపల్లిగూడెం అధ్యక్షులు కొప్పిశెట్టి రమణయ్య అధ్యక్షతన సుమారు 150 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు ప్యాడ్లు, పరీక్ష సామగ్రి అందిస్తూ శనివారం ఆల్ ది బెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. జోన్ చైర్‌పర్సన్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయన్నారు. డైమండ్స్ లయన్స్ క్లబ్ లయన్ పదం కుమార్ గుప్తా విద్యా ప్రోత్సాహం పథకంలో పదో తరగతి పరీక్షల్లో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థినిని రూ.10,116 నగదు ప్రోత్సాహంతో సత్కరిస్తామన్నారు. అధ్యక్షులు లయన్ కొప్పిశెట్టి రమణయ్య మాట్లాడుతూ టౌన్ టాపర్‌కు తమ నుంచి తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ పట్నాల రామకృష్ణ, డాక్టర్ కమల, కుందుం వెంకటేశ్వరారావు, మొటూరు వెంకటరత్నం, మునగాల జితేంద్ర, ముద్దం అప్పారావు, మున్సిపల్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లుకు రాష్ట్ర మంత్రులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లుకు రాష్ట్ర మంత్రులు శనివారం విచ్చేశారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు వివాహ నిశ్చితార్థం విచ్చేశారు. బొత్స సత్యనారాయణ, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు విచ్చేశరు. ఎంఎల్ఎ కవురు శ్రీనివాస్, వైసిపి పాలకొల్లు అభ్యర్థి గుడాల గోపీ, టిటిడి సభ్యులు మేకా శేషుబాబు, వైసిపి నేతలు గుణ్ణం నాగబాబు, అడబాల వెంకటరమణ, కోరాడ గోవింద్, చందక సత్తిబాబు పాల్గొన్నారు

ప్రొటోకాల్ పాటించకపోవడం తగదు

ఎంపిటిసి సభ్యులు జ్యోతి

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట పంచాయతీ పరిధి కౌరుపాలెంలో నాడు-నేడు కార్యక్రమంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను నిర్మించారు. ఈ పాఠశాలను ఎన్నికల కోడ్ నేపథ్యంలో సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు హడావుడిగా శుక్రవారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కనీసం స్థానిక ఎంపిటిసి, ఉన్నతాధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా కనీసం శిలాఫలకం కూడా ఏర్పాటు చేయకుండా ప్రారంభించడం హేయమైన చర్య అని ఎంపిటిసి సభ్యులు ఉల్లం జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎంపిటిసి అయిన తనకు సమాచారం ఇవ్వకుండా కనీసం ప్రొటోకాల్ పాటించకుండా పాఠశాలను ప్రారంభించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి అనైతిక కార్యక్రమాలు భవిష్యత్తులో చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆమె హెచ్చరించారు.

'దగా కోరు ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రానున్న ఎన్నికల్లో జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌ని భారీ మెజార్టీతో గెలిపిద్దామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి పిలుపునిచ్చారు. స్థానిక మాగంటి కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించిన టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. దగా కోరు జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలన్నారు. బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో తాడేపల్లిగూడెం అభివృద్ధి పరుగులు పెట్టిస్తామన్నారు. అధ్వానంగా ఉన్న రోడ్లన్నీ అధికారంలోకొచ్చిన ఆరు నెలల్లోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న వేసవి లోపు రెండో సమ్మర్ స్టోరేజ్ కూడా పూర్తి చేస్తామన్నారు. తొలుత ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో బిజెపి నాయకురాలు భోగిరెడ్డి ఆదిలక్ష్మి, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పన్ను బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - నరసాపురం

పన్ను బకాయి అంతా ఏకమొత్తంగా చెల్లించిన వారికి కల్పించిన వడ్డీ రాయితీ గడువు మరో 15 రోజులు మాత్రమే ఉండడంతో పన్ను చెల్లింపుదారులకు వీలుగా సెలవు రోజుల్లో కూడా క్యాష్ కౌంటర్లు యధావిధిగా పని చేస్తాయని, పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ నెలాఖరు లోపు తమ ఆస్తి పన్ను, ఖాళీ స్థల పన్నులు ఏకమొత్తంగా చెల్లించి వడ్డీ రాయితీని పొందాలని తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పన్నుపై వడ్డీ యదావిధిగా ఉంటుందన్నారు. పన్నుపై వడ్డీ రాయితీ పొందేందుకు 15 రోజులే గడువు ఉందన్నారు. దీంతో సెలవు రోజుల్లో కూడా మున్సిపల్ కార్యాలయం, 15 సచివాలయాల్లోని క్యాష్ కౌంటర్లు యధావిధిగా పని చేస్తాయన్నారు. పురపాలక సంఘానికి చెల్లించాల్సిన ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి పన్ను, డి, ఒ ట్రేడ్ లైసెన్సులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఎబివికె ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని బండ వెంకటసుబ్బారావు, వసుధ ఫౌండేషన్ సభ్యులు ఎంవి.రామరాజు ప్రారంభించారు. మాక్సివిజన్ కంటి ఆసుపత్రి వైద్య బృందం ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని గుర్తించారు. వారికి ట్రస్టు సహకారంతో ఉచితంగా చికిత్సలు అందించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వసుధ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రంలో ఒక వైద్యుడిని శాశ్వతంగా నియమించినట్లు చెప్పారు. నిరంతరం ఉచిత వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. రెగ్యులర్‌గా వివిధ వైద్య నిపుణులతో వారానికో క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించామన్నారు. ఈ వైద్య సహాయ కేంద్రాన్ని ఎస్-ఎల్‌జి ఆసుపత్రి, డెక్కన్ ఫైన్ కెమికల్స్, వసుధ ఫౌండేషన్, ఎబిఎస్‌వికెల సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'విభజించి పాలిస్తున్న రామరాజు'

ప్రజాశక్తి - నరసాపురం

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తురి రామరాజు నియోజకవర్గాన్ని విభజించి పాలించారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిటికెల రామ్మోహన్‌రావు విమర్శించారు. మండలంలోని రాయిపేటలో టిడిపి నాయకుల ఆధ్వర్యంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిటికెల రామ్మోహనరావు, కొట్టు పండు, నడిపూడి కృష్ణ, బస్వాని ఏడుకొండలు, చాగంటి ఆనంద్, రెడ్డిం శ్రీను, మాంద్రు హేమలత మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై మీరు పోరాడింది ఏమీ లేదన్నారు. స్థానిక ఎన్నికల్లో ఎనిమిదో వార్డులో మీరు చేసిన జిమ్మిక్కులు అందరికీ తెలుసన్నారు. ఈ సమావేశంలో చెంపాటి సత్యనారాయణరాజు, అంద్రాజు రామన్న, రేవు ప్రభుదాస్, కొండేటి శ్రీను, చాగంటి రాము, తంగెళ్ళ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

భీమవరంలో ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్

8 కోర్టుల్లో 18వ తేదీ నుంచి క్రీడల నిర్వహణ

200 మంది క్రీడాకారులు రాక

కాస్మో పాలిటిన్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పద్మరాజు, వెంకటరామరాజు

మాట్లాడుతున్న భీమవరం కాస్మో పాలిటిన్ క్లబ్ అధ్యక్షులు పద్మరాజు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో ఈ నెల 18వ తేదీ నుంచి 24 వరకు కాస్మోపాలిటన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ భీమవరం కాస్మో పాలిటిన్ క్లబ్‌లో నిర్వహించనున్నామని క్లబ్ అధ్యక్షులు అల్లూరి పద్మరాజు, కార్యదర్శి పెన్మెత్స వెంకటరామరాజు తెలిపారు. స్థానిక క్లబ్‌లో శనివారం టెన్నిస్ టోర్నమెంట్‌కి సంబంధించిన వివరాలను వారు వెల్లడించారు. వెర్టెక్స్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్) ఎండి వివిఆర్.వర్మ, క్లబ్ సభ్యుల ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో పురుషుల డబుల్స్ 35, 45, 55, 65, 70, 75 ఏళ్ల విభాగంలో టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. భీమవరంలోని కాస్మో, ఎల్‌హెచ్ టౌన్ హాలు, డిఎన్ఆర్, ఎస్ఆర్‌కెఆర్ కళాశాల క్రీడ మైదానంలోని ఎనిమిది కోర్టుల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో క్లబ్ సెక్రటరీ వివిఎస్.సుబ్రహ్మణ్యవర్మ, జాయింట్ సెక్రటరీ కురిశెట్టి సత్యనారాయణమూర్తి, కూనపరాజు రామకృష్ణంరాజు, రాంబాబు, యుఆర్‌పిఆర్.వర్మ, కెఆర్‌కె.రాజు, పివి.రామరాజు, వివిఎస్.వర్మ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులు

కలెక్టర్ సుమిత్‌కుమార్

ఘనంగా జయంతి వేడుకలు

భీమవరంలో...

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కలెక్టరు కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అన్నారు. ఆయన స్ఫూర్తిని నేటి యువత ఆలోచన చేసి ముందుకు అడుగులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ కానాల సంగీత్‌మాధుర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి జి.గణపతిరావు, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనరు చెరుకువాడ రంగసాయి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు : శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బంగారువారి ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి సంఘ అధ్యక్షులు మామిడి వెంకటేశ్వరరావు (బాబు), ఎపి ఆర్యవైశ్య మహాసభ మాజీ కార్యదర్శి నాళం బాపిరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. జాతిపిత విగ్రహానికి సంఘ మాజీ అధ్యక్షులు కారుమూరి శ్రీరాములు, అదనపు కోశాధికారి చక్కా చినగొల్లబాబు పూలమాలలు వేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి అధ్యక్షులు మామిడిబాబు, ప్రధాన కార్యదర్శి రేపాక ప్రవీణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీబొమ్మల సెంటర్ వద్ద, శ్రీ మన్యం జగ్గమ్మ గారి సత్రం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేశారు. పేదలకు పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ మాజీ అధ్యక్షులు మాటూరి నరసింహమూర్తి, ఉపాధ్యక్షులు శ్రీకాకొల్లు కామేశ్వరరావు, నాళం మాణిక్య శ్రీనివాస్, సంఘ కార్యదర్శి సనిశెట్టి లీలా భవన్నారాయణ, సహాయ కార్యదర్శి సలాది జనార్ధనరావు, మురహరి ఈశ్వరరావు, కారుమూరి సూర్యనారాయణ, పిరాట్ల శ్రీను, మాజేటి షణ్ముఖరావు, సలాది వెంకటలింగం, సలాది వెంకట్రావు, నంబూరి గంగాపవన్‌కుమార్, కర్పూరం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. పాలకొల్లు జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో పొట్టి శ్రీరాములు జయంతి పాలకొల్లు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వాసవి క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ శ్రీకాకొల్లు మైథిలి సహకారంతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు బహుకరించారు. ఈ సందర్భంగా మైథిలి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్రానికి చేసిన త్యాగం ప్రతిఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. ఆయన సేవలు రాష్ట్రానికి ఆదర్శప్రాయమన్నారు. పాఠశాల హెచ్‌ఎం రాయపూడి భవాని ప్రసాద్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ పాలకొల్లు అధ్యక్షులు మాటూరి సోమేశ్వర వెంకట రామ్ కుమార్, ట్రెజరర్ మాఘం శ్రీనివాసరావు, మాటూరి నరసింహమూర్తి, జోన్ ఛైర్మన్ పచ్చిగోళ్ల సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ఏలూరు రోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆడిటోరియం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్, శ్రీ ఆర్యవైశ్య మహిళా సంఘం సంయుక్తగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రముఖులు సభ్యులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా బస్టాండులో సుమారు 600 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షులు మారం వెంకటేశ్వరరావు, పూర్వాధ్యక్షులు వబిలిశెట్టి నటరాజ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోర్లేపర రాము, వాసవి క్లబ్ అధ్యక్షులు నున్న ఆనంద్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు కొనకళ్ల హరినాథ్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 227 కేసులు పరిష్కారం

భీమవరంలో...

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 227 కేసులు పరిష్కరించినట్లు భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, మూడో అదనపు జిల్లా జడ్జి పి.సత్యాదేవి తెలిపారు. విడాకుల కోసం కోర్టును ఆశ్రయించిన రెండు కేసుల్లో భార్యాభర్తలకు న్యాయ మూర్తులు, న్యాయవాదులు కౌన్సెలింగ్ ఇవ్వడం వల్ల కలిసి జీవించడానికి ఒప్పుకున్నారన్నారు. ప్యానల్ లాయర్స్, పారా లీగల్ వాలంటీర్లు, మీడియా సహకరించడం వల్లే ఈ సారి ఎక్కువ కేసులు రాజీ చేసినట్లు తెలిపారు. సివిల్ కేసులు 44, భీమవరం టౌన్, రూరల్, వీరవాసరం, ఉండి, పాలకోడేరు, కాళ్ల, ఆకివీడు పోలీస్‌స్టేషన్లకు సంబంధించిన క్రిమినల్ కేసులు 109, ఎక్సైజ్ కేసులు 20, మనోవర్తి కేసులు 10, చెక్ బౌన్స్ కేసులు 25 బ్యాంక్ రికవరీ కేసులు తొమ్మిది, బిఎస్ఎన్ఎల్ పది మొత్తం 227 కేసులను ఉభయ పార్టీల కోరిక మేరకు రాజీ చేసినట్లు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో నాలుగు బెంచ్‌లు ఏర్పాటుచేశారు. బెంచ్ అధికారులుగా న్యాయమూర్తులు అప్పలస్వామి, సురేష్‌బాబు, ధనరాజు, సభ్యులుగా పి.మాలతి, లత, ఎం.శ్రీనివాసరావు, కె.నాగరాజు, వి.కరుణాకరరావు, బెంచ్ సభ్యులుగా వ్యవహరించారు. పోలీస్ అధికారులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

నరసాపురం : నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నరసాపురం కోర్టుల భవన సముదాయంలో పదో అదనపు జిల్లా జడ్జి, సంస్థ ఛైర్మన్ పి.విజయ దుర్గ అధ్యక్షతన శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం నిమిత్తం నాలుగు బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఈ నాలుగు బెంచ్‌లకు న్యాయమూర్తులుగా పదో అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వై.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి, అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె.శ్రీనివాస్ వ్యవహరించారు. న్యాయవాద సభ్యులుగా ఎన్.విజయలక్ష్మి, చాందిని, డి.సుభాష్‌బాబు, పి.వెంకన్ననాయుడు పాల్గొన్నారు. కక్షిదారులకు బార్ అసోసియేషన్ తరపున సీనియర్ న్యాయవాది స్వామినాయుడు ఫ్రైడ్‌రైస్ అందించారు. జాతీయ లోక్‌అదాలత్‌లో సివిల్ కేసులు ఆరు, క్రిమినల్ కేసులు 53, బ్యాంకు, బిఎస్ఎన్ఎల్ మొండి బాకీ కేసులు 38 మొత్తం 97 కేసులు రాజీ అయ్యాయి. రాజీ అయిన కేసుల విలువ సుమారు రూ.1.50 లక్షలు అని తెలిపారు.

నరసాపురంలో...

తాడేపల్లిగూడెం : మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఛైర్మన్, 11వ అడిషనల్ జిల్లా జడ్జి సత్యవతి పర్యవేక్షణలో సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సూర్యకిరణ్‌శ్రీ, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అన్నామణి, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ డి.అరుంధతి ఆధ్వర్యంలో మొత్తం రూ.1,3,76,000 విలువైన 830 కేసులు పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు, పోలీసులు పాల్గొన్నారు.

రాముడుకు జాతీయస్థాయి ప్రాజెక్టు మంజూరు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నిట్‌లో ఫిజిక్స్ ఆచార్యునిగా పని చేస్తున్న డాక్టర్ మాచవరపు రాముడుకు సుమారు రూ.25 లక్షల విలువైన జాతీయ స్థాయి ప్రాజెక్ట్ ఇటీవల మంజూరైంది. స్పింట్రోనిక్ అనువర్తనాల కోసం మాంగనీస్ ఆధారిత యాంటీఫెరో మాగ్నెట్ హ్యూస్లర్ పదార్థాల అభివృద్ధి అనే ప్రాజెక్ కి సంబంధించి ఆయన పరిశోధించనున్నారు. ఈ నిధులను భారత ప్రభుత్వ ఆధీనంలోని సైన్స్, ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డు (సెర్బ్) కోర్ రీసెర్చ్ గ్రాంట్ (సిఆర్‌జి) నుంచి కేటాయించింది. దీని కాలపరిమితి మూడేళ్లు. ఈ నిధులతో రాముడు పదార్థాల అయస్కాంత లక్షణాలను, స్పింట్రోనిక్స్‌లో సాధ్యమయ్యే అనువర్తనాలను మెరుగుపరచడంలో ప్రతి మూలకం పాత్రను పరిశోధించనున్నారు. వీటితో పాటు స్పింట్రోనిక్ అప్లికేషన్‌లకు అనువైన కొత్త హ్యూస్లర్ యాంటీఫెరో మాగ్నెటిక్ మెటీరియల్‌లను రూపొందించి అభివృద్ధి చేయనున్నారు. జాతీయస్థాయి ప్రాజెక్టును దక్కించుకున్న రాముడిని నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ బిఎస్.మూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ దినేష్‌శంకర్ రెడ్డి మాట్లాడుతూ దేశ పురోగతిలో పరిశోధన, అభివృద్ధి పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. తమ విద్యా సంస్థకు చెందిన ఆచార్యులు ఇతర నిట్‌లకు ధీటుగా జాతీయస్థాయి ప్రాజెక్టులను దక్కించుకుని, సంస్థ ఖ్యాతిని ఇనుమడింపజేయటం అభినందనీయమని కొనియాడారు. ఆచార్యుల స్ఫూర్తితో విద్యార్థులు సైతం వినూత్న ప్రాజెక్టుల కోసం అంకితభావంతో కృషి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ జిఆర్‌కె.శాస్త్రి, డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థుల ప్రకటన.. పార్టీ శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థిగా కొట్టు సత్యనారాయణను ప్రకటించారు. ఈ సందర్భంగా స్థానిక క్యాంపు కార్యాలయంలో వైసిపి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తూ మిఠాయిలు పంపిణీ చేశారు. అన్నవరం నుంచి వస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణకు నందమూరు గ్రామం వద్ద పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు.

తాడేపల్లిగూడెం సీటు జగన్‌కు కానుకగా ఇద్దాం

వైసిపి అధినేత సిఎం జగన్ మళ్లీ టిక్కెట్ ఇచ్చారని, ఆ నమ్మకాన్ని నిజం చేస్తూ భారీ మెజారిటీతో తాడేపల్లిగూడెం సీటును గెలిచి జగన్‌కు కానుకగా ఇద్దామనిఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి, తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ అన్నారు. అభ్యర్థిగా ప్రకటించిన అనంతరం శనివారం తొలిసారిగా ఆయన మండలంలోని నందమూరు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలందరం ఐకమత్యంతో ప్రజల దగ్గరకు వెళ్తామన్నారు. ఆశావహులంతా అధినేత నిర్ణయానికి కట్టుబడి పార్టీ విజయానికి కృషి చేయాలని చెప్పారు.

వైసిపి భీమవరం అభ్యర్థిగా గ్రంధి శ్రీనివాస్

భీమవరం : రానున్న ఎన్నికల్లో వైసిపి నుంచి పోటీ చేసేందుకు భీమవరం సిట్టింగ్ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను అభ్యర్థిగా నియమిస్తూ పార్టీ అధిష్ఠానం శనివారం ప్రకటించింది. ఇటీవల భీమవరం బహిరంగ సభలో గ్రంధి శ్రీనివాస్‌ను అభ్యర్థిగా ప్రజల ముందు పెడుతున్నానని సిఎం జగన్ చెప్పినప్పటికీ ప్రస్తుతం అధికారకంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు.

ఆరోగ్య ప్రదాత జగన్ : గ్రంధి శ్రీనివాస్

రాష్ట్ర ప్రజల ఆరోగ్య ప్రదాత సిఎం జగన్ అని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. సిఎం సహాయ నిధి నుంచి లబ్ధిదారులకు మంజూరైన సుమారు రూ.29 లక్షల విలువైన చెక్కులను ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండి అభ్యర్థిగా పివిఎల్.నరసింహరాజు

కాళ్ల : వైసిపి ఉండి ఎంఎల్ఎ అభ్యర్థిగా పెన్మెత్స వెంకట లక్ష్మి నరసింహరాజును పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. 2019లో వైసిపి నుంచి పోటీ చేసి టిడిపి అభ్యర్థి మంతెన రామరాజుపై స్వల్ప ఓట్ల మెజార్టీతో ఓటమి పాలయ్యారు. తర్వాత ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డిసిసిబి ఛైర్మన్‌గా నామినేటెడ్ పదవి చేపట్టారు. పివిఎల్‌ను ఎంఎల్ఎ అభ్యర్థిగా ప్రకటించడంతో నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు.

ఉండిలో గెలుపొంది జగన్‌కు కానుకగా ఇస్తా

ఉండి : ఉండి అసెంబ్లీ స్థానాన్ని కైవసం చేసుకుని సిఎం జగన్‌కు కానుకగా ఇస్తానని పివిఎల్.నరసింహరాజు అన్నారు. పెదఅమిరంలోని వైసిపి కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రెండోసారి పోటీ చేసే అవకాశాన్ని కల్పించిన జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఉండి ఎంఎల్ఎ అభ్యర్థిగా పివిఎల్.నరసింహరాజును ప్రకటించగానే ఉండి వైసిపి నేతలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు మాట్లాడుతూ టిడిపి కంచుకోటలో వైసిపి జెండా ఎగరవేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు.

పాలకొల్లు అభ్యర్థిగా గుడాల గోపీ

పాలకొల్లు : వైసిపి పాలకొల్లు ఎంఎల్ఎ అభ్యర్థిగా గుడాల శ్రీహరి గోపాలరావు (గోపీ) ఖరారయ్యారు. దీంతో నియోజకవర్గంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆచంట అభ్యర్థిగా చెరుకువాడ శ్రీరంగనాథరాజు

ఆచంట : ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థిగా మరోసారి చెరుకువాడ శ్రీరంగనాథరాజును ప్రకటించడం పట్ల ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ ఆధ్వర్యంలో కొడమంచిలి పంచాయతీ కార్యాలయం వద్ద వైసిపి నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం శ్రీరంగనాథరాజు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సంబరాల్లో ఉప సర్పంచి ములగాడ వరప్రసాద్, వైసిపి నాయకులు పుచ్చకాయల నాగార్జున, చింతా సంపతరావు చికిలే ఆనంద్, పోలిశెట్టి వనమారాజు, గుమ్మడి ప్రదీప్ పాల్గొన్నారు.

ఉంగుటూరు అభ్యర్థిగా పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు)

గణపవరం : ఉంగుటూరు అభ్యర్థిగా పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు.

నరసాపురం : నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు పేరును ఖరారు చేశారు.

సర్పంచి కుటుంబానికి సిఎం రిలీఫ్ ఫండ్

ప్రజాశక్తి - గణపవరం

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వరదరాజపురం గ్రామ సర్పంచి గోటేటి నరసింహమూర్తి కుటుంబ సభ్యులకు శనివారం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ చిన్న వయసులోనే సర్పంచిగా ఎన్నికైన నరసింహమూర్తి గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దండు వెంకటరామరాజు, వైసిపి కన్వీనర్ దండు రాము, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీరందించేందుకు చర్యలు

ప్రజాశక్తి - మొగల్తూరు

దాళ్వా సాగులో శివారు ప్రాంతానికి సాగు నీరందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. మండలంలోని శేరేపాలెం, పాలకమ్మచెరువు, కెపిపాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, సౌత్, మొగల్తూరు పంచాయతీలోని కొత్తకాయలతిప్ప, నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం ప్రాంతాల్లో పంటబోదెలు తవ్వుతున్నారు. శనివారం కెపిపాలె నార్త్‌లోని రాజుగారి ఒడ్డు ప్రాంతం నుంచి బ్యాంక్ రోడ్డు వరకు శివారు ప్రాంతంలోని ప్రతి ఎకరాకు నీరందెలా పంట బోదెల్లో పూడిక తొలగింపు చేపట్టామని టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో పురోగతి

ప్రజాశక్తి - గణపవరం

వైజ్ఞానిక ప్రదర్శనల వల్ల విద్యార్థులు విద్యారంగంలో పురోగతిని సాధిస్తారని గణపవరం ఎంఇఒ-2 బాలయ్య అన్నారు. మండలంలోని సరిపల్లిలో ఉన్న ఇండియన్ డిజిటల్ స్కూలులో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రదర్శనలో విద్యార్థులు చేసిన గ్లోబల్ వార్మింగ్ చంద్రయాన్-3 విండో ఎనర్జీ హైడ్రేకల్ ఎనర్జీ వంటి ప్రాజెక్టులు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ జివి.ప్రసాద్, ప్రిన్సిపల్ జి.పద్మిని దుర్గ, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఆచంట

పెనుగొండ - వల్లూరు పీడర్ విద్యుత్ లైన్ మెయింటినెన్స్ నిమిత్తం ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సురేష్‌కుమార్ తెలిపారు. ఆచంట సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తగా విద్యుత్ లైన్ల ఏర్పాటు, చెట్టు కొమ్మల తొలగింపు నేపథ్యంలో మండల పరిధిలోని ఆచంట, ఆచంట వేమవరం, కొడమంచిలి, కోడేరు, పెదమల్లం, వల్లూరు, భీమలాపురం, కరుగోరిమిల్లి, అయోధ్యలంక, పోడూరు, వద్దుపర్రు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఒరిజినల్ పొలం డాక్యుమెంట్స్ పోయినవి

గూడూరి వెంకటేశ్వరరావు (ఆధార్ 9852 9531 2481) క్లర్క్, పిఏసిసి సొసైటీ, పెనుమదం, డోర్ నెంబర్ 3-50, S/o. సూర్యమూర్తి, పెనుమదం-534267, పోడూరు మండలం, ప॥గో॥జిల్లా అయిన నేను, కోరు విన్నపం ఏమిటంటే ది. 11-3-2024వ తేదీన పాలకొల్లులోని బ్యాంకు నుండి నా పొలం ఒరిజినల్ డాక్యుమెంట్లు మోటార్ సైకిల్‌పై పెనుమదం ఇంటికి తీసుకుని వస్తుండగా దారిలో పడిపోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికిన నాకు అందజేయవలసిందిగా కోరి ప్రార్థించుచున్నాను.

ఇట్లు: గూడూరి వెంకటేశ్వరరావు
సెల్: 8978790566

ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్స్ పోయినవి

పాలకొల్లు మండలం, లంకలకోడేరుకు చెందిన ఎస్.ఎస్.చంద్ర బొమ్మగాని, టీచర్, ఆధార్ నెంబర్ 2102 7633 3411 నియర్ 3-146, గ్రామ కచేరి వద్ద, లంకలకోడేరు, పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా తెలియజేయునది ఏమనగా,

ది. 02-3-2024వ తేదీన మా ఇంటి నుండి లంకలకోడేరు మెయిన్ సెంటర్‌కు నా బి.ఈడి. ఒరిజినల్ డిగ్రీ పత్రాలు, కన్సోల్డ్ మార్క్స్ మెమో ఒరిజినల్ సర్టిఫికెట్స్ జిరాక్స్ తీయించేందుకు మోటార్ సైకిల్‌పై వెళు తుండగా దారిలో పడిపోయినవి. ఎంత వెతికిన దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికిన యెడల నా పై అడ్రస్‌కు అందజేయవలసిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

ఇట్లు: ఎస్.ఎస్.చంద్ర బొమ్మగాని
సెల్: 8500427549

దస్తావేజులు పోయినవి

గంటా గాయత్రి అనే కిన్నెర, భర్త: వెంకటరమణ, ఇరగవరం మండలం, ఓగిడి గ్రామం, పశ్చిమగోదావరి జిల్లా అను నేను యావన్మందికి తెలియజేయడమేమనగా నాకు సంబంధించి అనగా పెనుగొండ మండలం, పెనుగొండ గ్రామపంచాయతి పరిధి చెరుకువాడ గ్రామానికి చెందిన రి.స.నెం. 128/4బి దాఖలా డోర్ నెంబర్ 28-41 రుకు సమీపమున గల చ॥గ॥ 146లు గల ఖాళీ నివేశన స్థలము సంబంధించి **దస్తావేజు నెంబర్ 1236/2014** ఒరిజినల్ దస్తావేజులు మరియు దాని **లింక్ డాక్యుమెంట్ నెం. 3361/2011** కు గల ఒరిజినల్ దస్తావేజులు రెండును ఒక కవర్లో పెట్టుకొని మా అమ్మ గ్రామ పెనుగొండ వచ్చి మా మేనమామ బైక్‌కు డాక్యుమెంట్స్ కవరు తగిలించుకుని జిరాక్స్ షాపుకి వెళ్లి వస్తుండగా మార్గ మధ్యలో పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రసుకు సంప్రదించగలరు.

అడ్రస్:
గంటా గాయత్రి అనే కిన్నెర
W/o. వెంకటరమణ, ఓగిడి గ్రామం
ఇరగవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 9121833637